G. R. Chiranjeevi
IV Standard
[illegible] School
Tirupati

# మాణిక్యం

పల్లెటూరి కాపురములలో పాటుపడి రోజులు వెళ్లదీసే కాపు కుటుంబములలో సుబ్బన్న కుటుంబముకూడా చెప్పతగ్గదే. కుటుంబమంటే, పాతిక యిరవైమందిలేరు. సుబ్బన్నా పెళ్లాము మాణిక్యమూ, ఆరేళ్ల కొడుకూను. ఓర్పుకీ, పెద్దమనిషితనానికీ, సాటికుటుంబాలలో మాణిక్యాన్ని ఉదాహరణంగా తీసుకునేవారు. చుక్క పొడవడంతోటే నిద్రలేచి, కొంచెం పుల్లనీళ్లూ అన్నమూ పెట్టి మొగుణ్ణి పొలానికి పంపించి, యెద్దుల గాటి దగ్గర పేడా, దంటూ యెత్తి శుభ్రంచేసుకొని యిల్లూ దొడ్డీ వూడ్చి, కలాపిచల్లుకొని, చల్లచిలికి నోట్లో బొగ్గువేసికొని దంతధావన ఆరంభించేసరికి సాగదీసుకొంటూ కొడుకు నిద్రలేచేవాడు; తనతోపాటు వాడికికూడా మొహంకడిగి, కవ్వందగ్గిర చల్లతోటీ, వెల్లుల్లికారంతోటీ వాడికి చద్దిపెట్టి తనుదినేటప్పటికి బారెడున్నర పొద్దెక్కేది. గబగబా రెండు గేదెలకీ, చిట్టూ తవుడూ పెట్టి, కడుపునిండా నీళ్లుపట్టి, నాలుగుదుత్తల పాలూతీసి, పిడకలదాలిమీద పడేసి, వంట ఆరంభించేది. పొద్దు నడినెత్తిమీదికి వచ్చేటప్పటికి బువ్వమూటా, నీటిదుత్తా పట్టుకొని, అప్పుడే యెద్దుల మెడమీద కాడిదించి తనకోసము యెదురుచూస్తూ వేపచెట్టునీడన కూర్చునే సుబ్బన్నని చేరుకొనేది. సుబ్బన్న, దుత్తా, మూటా అందుకొని, ఆరగించేసరికి, తారాజువ్వలాగ కొడవలితో మోపెడు చొప్పకోసి కట్టుకట్టుకొనేది. లెక్కకి నాలుగు నిమిషాలు, వూళ్లోసంగతులు విమర్శనలతో సహా మాట్లాడుకొనేవారు ఆ దంపతులు. గడ్డిమోపు నెత్తిన

బెట్టుకొని, దుత్త చేత్తోపట్టుకొని, యెకాయెకి యిల్లుచేరి, నిద్రబోతూన్న పిల్లాడిని లేపి, వాడికి అన్నంపెట్టి, తనుదిని, మళ్ళా యిల్లూ వాకిలీ శుభ్రం చేసుకొని, కొప్పుదువ్వి దొడ్లోపూసిన యే బంతిపూలో, యే చంద్రకాంతం పూలో కొప్పులోతురిమి, పిల్లాడికి వేణ్ణీళ్లు కాచిపోసి, తనునీళ్లుపోసుకొని, సాయంత్రపువంట ఆరంభించేసరికి, మోపెడునాము నెత్తినబెట్టుకొని, యెద్దుల్ని తోలుకొని, సుబ్బన్న యింటికివచ్చేవాడు. నాము తెగగొట్టి, యెద్దులగాట్లోవేసి, యెద్దులకి వేణ్ణీళ్లతో వొళ్లు గడిగి, తను నీళ్లుపోసికొని, చుట్టగాలుస్తూ, ఆరుబయట వెల్లకిలా వాల్చిన మంచంమీద పడుకొనే వాడు సుబ్బన్న. కొడుకు అన్నంతిని, తండ్రిప్రక్కనజేరి, ఆమాటా, యీమాటా, చెపుతూ నిద్రపోయేవాడు. శిస్తులమాటా, ధరలమాటా, కరణం మునసబుల ఆనాటి చర్యలమాటా యెత్తుతూ రంగన్నా, రామన్నా వచ్చి కాసేపుమాట్లాడి వెళ్లేవారు. అప్పుడు లేచి భోజనం చేసేవాడు సుబ్బన్న. తను, అన్నందిని, సామానులుసర్ది, పక్క వేసేది మాణిక్యం. పెరట్లోవేసిన పెద్దమంచంమీద పడుకొని దంపతులిద్దరూ, మైమరచేవారు.

మాణిక్యం కాపురానికివచ్చిన యేడేండ్లనుంచీ, యిదే వాళ్లదినచర్య; సేద్యము, పనీలేనికాలంలో, బందుగుల్ని చూడటానికీ, మ్రొక్కుబళ్లు తీర్చుకోవడంకోసము తిరునాళ్లకీ, వెళ్లిరావడము, ఇలా యేడాదీ గడిపే వారు. చీకూ, చింతా లేకుండా, యేయేటి ఫలసాయంమీద ఆయేడు వెళ్లదీస్తూ, సుబ్బన్నా, మాణిక్యమూ కాపురము చేసుకుంటున్నారు. ఓ(త్రా?)గుడనీ, కోడిపందేలనీ కానిపోకిళ్లు పోయేవాడుకాదు సుబ్బన్న. సుబ్బన్నమనసుకి వచ్చినభార్య మాణిక్యం.

శాంతంగా వెడుతూన్నరోజులలోనే. తుపానువీస్తుంది కాబోసు!

రెండుమూడు నెలలనుంచీ, యేడేళ్లుగా వొడిదుడుకులు లేకుండా సాగిన సంసారములో బీభత్సంపుట్టింది. అకస్మాత్తుగానూ, అతికల్లోలం

గానూ గోడవపుట్టింది. ఇరవైరోజులదాకా మాణిక్యానికి యేమీ జాడ పొడగట్టలేదు. సుబ్బన్న యింటికి ఆలస్యంగారావడమూ, యేదో పరధ్యానంతో వుండడమూ కూడా అలవాటుపడిన దైనికచర్యల్లో ఆమె గమనించలేదు. ఉండబట్టలేని యే పొరుగు ఆవిడో అంది. "మాణిక్యం. చిలకా గోరింకల్లాంటి మొగుడూ పెళ్లాలు కనక చెపుతున్నా. మీది పేరుమోసిన కాపురము. సుబ్బన్న నాయన నారన్ననీ, అమ్మ కోటమ్మనీ నే నెరుగుదును. వాళ్లు వేలుపెట్టి చూపించుకోలేదు. నువ్వు నిజంగా మాణిక్యానివి. సుబ్బన్నకూడా మంచోడే; మరోలాగనుకో కేం—సూరయ్యకూతురు నాలుగునెల్లనాడు పెనిమిటిపోయాడు దానికి. యిప్పుడువచ్చి యిక్కడే పుట్టింటువుంటోంది. అదేమో—మందో మాకో పెట్టిందో—మైకం చల్లిందో — కాని చూడు మాణిక్యం, నేను చెప్పాననిగానీ అనేవుసుమీ సుబ్బన్న మతిపాడుచేసింది ఆముండ; ముచ్చటగాచేసుకొనే నీ సంసారానికి అగ్గిరాసింది. ఊరంతా గుప్పుమంటోంది. అయిన ప్రాణమూ, ఆడప్రాణమూ గనక, ఉండబట్టలేక యింటిమొగాణ్ణి దారికి తెచ్చుకుంటావని చెపుతున్నా. వున్నమ్మ నీతో చెపుదామని మళ్లీఅతగాడికి కోపమొస్తుందని వెనక్కి తగ్గింది. కాని, నా ప్రాణ మూరుకోదమ్మా!

చల్లగా, తన చల్లనిగుండెకి మంటలు తగిలించే యీ వుపన్యాసాన్ని, ఊపిరైనా పీల్చకుండా వింది మాణిక్యం. తను కాపురానికివచ్చిన పదేళ్లూ వొక్కసారి ఆమెకళ్లముందు కనుపడ్డాయి. అంతసౌఖ్యంగా తనతో మెలిగిన సుబ్బన్న యిలాచేస్తున్నాడా! తను అందమైందికాదూ!! సుబ్బన్నకి యిలాంటిబుద్ధి పుట్టిందా? ఆలోచించినకొద్దీ, ఆమెకి యీర్ష్య పెరిగి పోయింది. చెప్పడానికి సాధ్యంకాని ఆవేదన పుట్టింది. "నిజమేనా! యేమో; ఇరవైరోజులాయె నా మొహమే చూడ్డంలేదు. కానిబుద్ధులు పుట్టాయిగామాలె. అవరా! ఊరంతా గుప్పుమంటోందిట. వీరమ్మ చెప్పిం

జాకా నాకు ఆకలింపేలేదు. ఇంటిమగోణ్ణి కానిపోకిళ్లు పోకుండా నిభాయించలేకపోతే యేం బ్రతుకు. ఛీ. ఇష్టాబుద్ధి పుట్టినవాడు, యింక నన్నూ, బిడ్డనీ కళ్లజూస్తాడా? ఈ మాట అనుకునేటప్పటికి దుఃఖం కెరటాలలాగ త్రెళ్లుకొనివచ్చింది. మొహంమీద గుడ్డకప్పుకొని, బావురుమని ఒక్కసారి యేడ్చింది. "రానీ, అడుగుతా," అనుకొని నిత్యకృత్యాల్లోకి దిగింది.

బరువెక్కినగుండెతో, మాణిక్యం పొయ్యిదగ్గరకూచుంది. కుండలో వుడికే అన్నంతోపాటు, మాణిక్యంవొళ్లుకూడా కుతకుత లాడిపోతోంది. చెంపనచెయ్యి చేర్చుకొని, ఆలోచిస్తూ మధ్యనిట్టూర్పులు విడుస్తూ ఉత్సాహహీనంగా వుంది.

"అన్న మింకావుడకలే?" అన్నాడు సుబ్బన్న, లోపలికి వచ్చి ద్వారబంధం రెండుచేతులతోటీ పట్టుకొని నిలుచుని. ఇరవైరోజులనుంచి తను కనిపెట్టలేనిమార్పు, మాణిక్యానికి అప్పుడు సుబ్బన్నగొంతులోనే కనిపించింది. దొంగతనాన్నిచేస్తూ, బయలుపడకుండా చేసుకోడానికి ప్రయత్నించే బలహీనత్వాన్ని ఆ గొంతులో నిముషంలో కనిపెట్టేసింది మాణిక్యం. జవాబుచెప్పటానికి అసహ్య మేసింది మాణిక్యానికి.

"నిన్నే...అన్నమింకావుడకలే?"

మాణిక్యం మాట్లాడలేదు.

"నిన్నే నే. ఏమిటా ఆలోచనా?"

పొంగివొస్తున్న ఆవేదనతో, అతనికేసిచూసింది. ఆకళ్లని చూడలేక పోయాడు సుబ్బన్న. అతనినిలువంతా వొక్కసారి కంపించింది.

"ఇంకా వంటదగ్గరే వున్నావేం?" అన్నాడు బెదుగుతూ పందెం వోడిపోయినవాడిలాగ.

"తొందరేం! పోవాల్నా—," మాట సగంలోమింగేసింది మాణిక్యం.

"పనుంది. పోవాల"

"రాచకార్యం గామాలె. అవున్లే. రాకపోతే వూరుకుంటారూ, కాపురంచేసుకునే మగాడికి బుద్ధివుండక్కరలేదూ—ఛీ—"

సుబ్బన్నకి సంగతి బోధపడిపోయింది. తన తప్పు బయటపడి పోయిందని తెలుసుకున్నాడు. ఇంక తన్నుతను కాపాడుకోవాలి.

"ఎవరువారు, నువ్వనేది నా కర్థంగావటం లేదు."

"అర్థమవుతుందీ? నువ్వుచేసేపని యెవరికీ తెలియదనుకుంటున్నావు గామాలె. లోకమంతా కోడైకూస్తోంది. సూరయ్య కూతురు—ఆముండ మోపిది—" మాణిక్యంవొళ్లంతా భగ్గుమంది. సుబ్బన్న నవనాడులూ క్రుంగిపోయాయి.

"ఛండాలపుముండ నా కాపురానీ కెసరుపెట్టిందీ, సంసారంచేసుకునే మగాడివి నీకు తెలివి వుండక్కరలా? నాకు తెలియదనుకున్నావా! ఇరవైరోజులనించీ పరీచ్ఛగా చూస్తానేవున్నాను. ఇంత పాడుపని నువ్వు చేస్తావని నేననుకోలేదు. ఛీ. ఆముండదగ్గరికే, ఛీ. పాడుముండ— అన్నం వేళకి తయారవుతున్నావు యిరవైరోజులనుంచి—పిచ్చిబొందని కనక చప్పున కనిపెట్టలేకపోయాను. —నా మొగమెట్లా చూస్తావు ఛీ ఆముండదగ్గరికి!"

సుబ్బన్నకి కోపమొచ్చింది. తనసంగతి మాణిక్యానికి తెలిసినందుకు కాదు. మాణిక్యం, దానిని తిట్టినందుకు. కాపురానికివచ్చిన -యేడేండ్ల నుంచీ యిలాంటిపరిస్థితి ఆదంపతులకి సంభవించలేదు. ఇలాంటి సంఘటనలో యెలాప్రవర్తించాలో యిద్దరిలో యెవరికీ తెలియదు. పొంగి, వొళ్ళంతా వుడికిస్తూన్నయీర్ష్య మాణిక్యానిదీ, రేగివస్తూన్నకోపము సుబ్బన్నదీని.

"నోరుముయ్యి. వొళ్లుపై తెలియకుండా, వాగబోకు. కిట్టనిముండలు చెప్పేమాటలువిని నోటికొచ్చినట్లల్లా మాట్లాడక" అన్నాడు సుబ్బన్న.

"పాడుముండలు చెప్పారా! నువ్వుమంచోడివి, ఆ దొంగముండ పతివ్రతా నా?"

"ఛీ నోరుముయ్యి!" సుబ్బన్నకి కోపము యెక్కువైంది.

"నోరుముయ్యాలేం! నువ్విట్టాగే చేస్తావేం పదిమందినీ తీసికెళ్ళి, ఆముండకి గడ్డిపెట్టించనూ!"

సుబ్బన్నకోపం రూపం దాల్చింది. "పాడుముండా, వొళ్లుపై తెలియడంలేదూ, దరిద్రపుముండా నోటికొచ్చినట్టు మాట్లాడుతావ్!" అంటూ ఫెడేఫెడీమని నాలుగు దెబ్బలు బాదాడు. మాట్లాడకుండా పెద్దపెద్ద అడుగులు వేసుకెంటూ బయటికి వెళ్లిపోయాడు.

మాణిక్యానికి యీర్ష్యతోటి అవమానంకూడా కలిగింది. కాపురానికివచ్చిన పదేళ్ళనుంచీ, పల్లెత్తుమాటకూడా అని యెరుగని సుబ్బన్న యివ్వాళ చెయ్యిచేసుకున్నాడు. ఇదంతా ఆ పాడుముండే బోధపరిచి వుంటుదనుకొంది మాణిక్యం. చక్కగా చేసుకొనే తన కాపురానికి నీళ్లు పోస్తోందీ! చూసిచూసి వూరుకోవడం యెలాగ! తననికొట్టె ఆముండతో

కులకటానికి పోయాడుకాబోలు. ఏంచెయ్యడానికీ మాణిక్యానికి తోచింది కాదు. కొడుకును వెంటబెట్టుకొని, ఇంటికి బయటి గొళ్లెంపెట్టి, వీరమ్మ గారింటికి పోయింది.

వీరమ్మని కావులించుకొని యేడ్చి, జరిగిన సంగతంతా చెప్పింది మాణిక్యం. తన పుట్టింటికిపోతాను సాయ మెవరైనా పంపమన్నది. వీరమ్మ యిలాంటి సమస్యల్ని వొందలకొద్దీ విడదీసినమనిషి ఇటువంటి. పరిస్థితుల్లో యెలాప్రవర్తించాలో వీరమ్మకి బాగా తెలుసు. ఏదో యాదాలాపంగా తను అంటించినముక్క యింతపనిచేసింది. ఇప్పు డెవర్నైనా సాయమిచ్చి మాణిక్యాన్ని పుట్టింటికి పంపితే వూరంతా తనను చివాట్లు పెడతారు. మాణిక్యం పుట్టిల్లు అక్కడికి బాగా ఆమడదూరముంది. మధ్య చిన్నఅడివిగూడా వుంది. రోడ్డువున్నా రాత్రిపూట ఇద్దరు ముగ్గురు మొగాళ్లు జట్టుగా కలిసికూడా ఆదారినిపోవటానికి జడుస్తారు. అందుచేత యేవిధాన్నచూసినా మాణిక్యాన్ని పుట్టింటికి పంపించడము అంత సమంజసమైన పనికాదు.

“ఆలోచనచెపుతా” రా, అని మాణిక్యాన్ని చెయ్యిపట్టుకొని వాళ్ళింటికే తీసుకొనిపోయింది వీరమ్మ. దారిలో “యేదో మెల్లిగా దారికితెచ్చుకోవాలి గాని అలా మొగాడిమీద కోప్పడితే చిక్కు మనకే” అంటూ సర్దిచెప్పింది. వీళ్లు యింటికి వెళ్లేటప్పటికి సుబ్బన్న ఆరుబయటవేసిన మంచంమీద పడుకొని ఆలోచిస్తూవున్నాడు.

“ఏమిట్రా తమ్ముడూ, మరదలిమీద చెయ్యిచేసుకున్నావుట. బిడ్డనికన్న తండ్రివి కాస్త పస్తాయించవొద్దూ ఆడగూతురు యేదేనా కాస్త కటువుగా మాట్లాడితేమాత్రం సముదాయించుకొని పోవాలిగాని అంత

[పదిహేను

తొందరపడితే యెట్లా? నలుగురూ నవ్వరూ! నిదానముండొద్దూ? లే లే, అన్నం తినండి! " అని వీరమ్మ తనే వాళ్లిద్దరికీవడ్డించి పోట్లాడుకోవద్దనీ నలుగురు నోళ్లలోనూ పడొద్దనీ, బోధించి, వెడుతున్నానంటూనే రెండు గంటలు కూచుని వెళ్లిపోయింది. అంతేకాని అసలు సంగతియెత్తి వీరమ్మ కూడా, సుబ్బన్నని మందలించిందికాదు. దంపతులు యెడమొగం పెడ మొగంగా పడుకొని నిద్రపోయారు.

నాలుగు రోజులదాకా ఒకరిమొహం వొకరు చూసుకోలేకపోయారు ఆ దంపతులు. దినచర్యమాత్రం యథావిధిగా జరిగిపోతున్నది. సుబ్బన్న చేత, అతను చేసినపని తప్పు అని వొప్పించాలనీ ఇంకెన్నడూ దాని మొహం చూడననిపించాలనీ మాణిక్యంపట్టు; నేను స్వతంత్రుణ్ణి నాయిష్టమొచ్చి నట్టు నేను చేస్తాను, దీని పెత్తనమేమిటని సుబ్బన్న మొండితనం—భార్యా భర్తల పొత్తు మళ్లీ కలిసిందికాదు. సుబ్బన్నమాత్రం యథాప్రకారం సూరయ్యకూతురిదగ్గరకు వెళ్లడం మానలేదు. ప్రతిపూటా అన్నం దినే టప్పుడు, యీ గొడవతెచ్చి సాధింపు మొదలుపెట్టేది మాణిక్యం. విసు క్కుంటూ, తిడుతూ అన్నమంతా విరజిమ్మి లేచిపోయేవాడు సుబ్బన్న.

మాణిక్యానికి రోజులుగడిచినకొద్దీ ఓపిక తక్కువైంది. 'దానిదగ్గరకు వెళ్ళడం మాంతావా, మానవా?' అని సుబ్బన్నని నిలువదీసి అడిగి వ్యవ హారం తేలుద్దామని నిశ్చయంచేసుకుంది.

రాత్రి ఎనిమిదిగంటలయింది; జోరున కురిసినవాన అప్పుడే వెలిసింది. మబ్బువిడి ఒక్కొక్కటొక్కటే చుక్కలు కనపడుతున్నాయి. సుబ్బన్న యింటికివచ్చాడు. సణుక్కుంటూ పీటవేసి, కంచుకంచంలో అన్నంపెట్టింది. మాణిక్యం. ఇంకా అన్నం కలపలేదు సుబ్బన్న.

"ఇదిగో చూడు, నువ్వు దాని దగ్గరకుపోవడం మాంతావా, మానవా" అంది, మాణిక్యం. భయం తీరిపోవడంచేత మొండిబారిపోయిన సుబ్బన్నకి కోపం బాగా వచ్చింది.

"నువ్వు యింకోసారి ఆమాట యెత్తావంటే తంతాను" అన్నాడు. ఆదంపతులలో ఒకరు తప్పుచెయ్యడమూ రెండోవారు సహించలేకపోవడమూ జరగడంచేత, అదివరకు వాళ్ళకి వొకరిమీద యింకొకరికివుండే పూజ్యభావాలుపోయినవి.

"తంతావూ; దాన్నే తీసుకొచ్చి యిక్కడబెట్టుకో, నేనీకొంపలో కాపురం చెయ్యను. అంత యిష్టములేని మొగుడితో కాపురమేమిటి! దాన్నే బెట్టుకొని వూరేగు."

"మాథరోఫ్చెడ్. ఫో. ఎక్కడికిపోతావో, నాయిష్ట మొచ్చినట్టూ వూరేగుతాను?" అని లేచికొట్టాడు మాణిక్యాన్ని.

"ఈ పాడుకొంపలో యింక అడుగుపెట్టను" అని, పిల్లాడిని తీసుకొని బజారులోకి వచ్చింది మాణిక్యం. జనమంతా యిళ్లలో వున్నారు. ఎక్కడో తప్ప మనిషి అలికిడిలేదు. ఎక్కడికి ప్రయాణం! వీరమ్మ యింటికిపోతే మళ్లా తనింటికే తీసుకొస్తుంది. వీరమ్మే యేమిటి?—ఆవూళ్లో యెవరైనా అంతే. ఏం చెయ్యాలి? అమ్మగారింటికిపోతే—, కొన్నాళ్లకి, చచ్చినట్టు సుబ్బన్న తనకోసం రాకమానడు. వచ్చిన సుబ్బన్నని, నాన్నచేతా, అమ్మచేతా, తమ్ముళ్లచేతా నాలుగూ పెట్టించవచ్చును. రాకపోతాడా?—పోనీ, అంత తన అవసరం అతడికి లేకపోతే, యెక్కడుంటేనేం, తను? ఇదీ మాణిక్యం తేల్చుకున్న అభిప్రాయం.

ఆమడదూరము ఒక్కత్తీ అడివిగుండా పోవడమే !

అడివీ, ఆమడదూరమూ. అర్ధరాత్రీ యివేవీ మాణిక్యానికి తోచలేదు. తనని అంత తృణీకరించిన మొగుడిదగ్గరనుంచి యెంతదూరముపోతే, అంత మనశ్శాంతి కుదురుతుందనుకుంది. వెనక్కి తిరిగి యింటివైపు చూడటానికికూడా ఆమెకి మనస్కరించలేదు.

ఒక్క విసురున నడక ఆరంభించింది. కొడుకు తనతో నడుస్తున్నాడు. అమ్మని నాన్న కొట్టడమూ, వాళ్ళిద్దరూ మాట, మాట అనుకోవడమూ చూస్తూ సేవున్నాడు, ఆకుర్రాడు. తల్లితోపాటు వాడూ మాట్లాడకుండా బయలుదేరాడు, ఆవువెంబడి దూడలాగ.

కుమారుని వెంటబెట్టుకొని రోడ్డుమీద ప్రయాణము చేస్తోందేకాని, మాణిక్యం మనసు ప్రయాణముమీద లేదు. సుబ్బన్న ఎలా దారికివస్తాడు, తనకాపురం మళ్లా ఎలాసరిపడుతుంది, ఇదే ఆలోచన ఆమెకి.

"ఎక్కడికే అమ్మా యింతచీకట్లోనూ!" అన్నాడు కుర్రాడు.

"అమ్మమ్మగారింటికి. దబదబానడు, చప్పునపోదాం" అందిమాణిక్యం.

దారిపొడుగునా చెట్లమీదనుంచి, వానచినుకులు వీళ్లమీద పడుతున్నాయి. చెవులు గింగెరుమనేటట్టు కీచురాళ్లు అరుస్తున్నాయి.

సుమారు మూడుమైళ్లు నడిచింది మాణిక్యం. రోడ్డుమీద, పూర్వం టోలుగేటు పెట్టిన చిన్న పెంకుటిల్లు వుంది. అక్కడికి వచ్చింది.

[ పద్ధెనిమిది

"ఎవ రాదారినిపోయే మనిషి! ఆగూ!" అని అడివంతా దద్దరిల్లేటట్టు పెద్దకేక వినబడింది. మాణిక్యానికి కాలు ముందుకిసాగిందికాదు. నాలుగు వైపులా చూడటానికి మెడకూడా తిరగలేదు. నరాలన్నీ బిగుసుకు పోయాయి. నడుస్తూవున్న కుర్రాడు తల్లి రెండుకాళ్ళూ గట్టిగా కావులించుకున్నాడు: "అమ్మా, ఏమిటే! భయమేస్తాందే" అన్నాడు.

"భయంలేదు, వుండు" అందికాని, తనమాట తనకే వినపడలేదు.

ఎదురుగుండా మొద్దుల్లాగ నల్లటి కాయపారు శరీరాలతో, చేతుల్లో వున్న బడితెలతో, నలుగురు మనుష్యులు ప్రత్యక్షమయారు. "ఎవరే, నువ్వా" అన్నాడు వారిలో వొకడు. వాడినల్లటిమొహంలో తెల్లటిపళ్లు తళుక్కుమన్నాయి. మేఘాలు వురిమినట్టు నలుగురూ నవ్వారు.

"బాబూ మీ బిడ్డని" అని దణ్ణంపెట్టింది మాణిక్యం.

"ఓస్, ఈవేషాలువెయ్యకు. ఏవూరునీది ? అది చెప్పు. ఎక్కడికి పోతున్నావు? అదిచెప్పు." అన్నాడు వాడే.

"బాబూ, మీబిడ్డని; మాది, పాలెం. మా అమ్మకి ప్రాణంమీదికి వచ్చిందని కబురుదెలిసి నేను పేటలో మా అమ్మగారింటికి పోతున్నా. పేటలో సింగరయ్య కూతుర్ని నేను. మీకు దణ్ణం పెడతా, నన్ను పోనియ్యండి. మీ కడుపునపుడతా" అంది మాణిక్యం. వాళ్లు వొకరిమొహం వొకరు చూచుకొని యేదో గుసగుసలాడుకున్నారు.

"నాయనా, నా అన్నలు మీరు. నేను కొడుకుతల్లిని. మీకడుపు చల్లగా నన్నుపోనియ్యండి. మీకు పుణ్యముంటుంది ?"

"ఏయ్ ఊరికేవాగబోకు. తొందరపడకరా, యిట్రా, నీతో కొంచెం పనివుంది." అని కుర్రాణ్ణివొకడూ, ఆమెనివొకడూ, కేకవెయ్యడానికీ, మాట్లాడడానికీ కూడా వీలులేకుండా లాక్కుని, ఆ టోలుగేటు వెంకు టెంట్లోకి తీసుకుపోయారు. ఆమె గింజుకోవడంచూచి పిల్లాడు బ్యారు మన్నాడు. 'మాట్లాడితే నరుకుతా' నని ఒకడు చిన్నకత్తి చూపాడు. పైకియేడవకుండా పిల్లాడు లోలోపలే కుమలడం ఆరంభించాడు. "ఏయ్, మామాటవిను, నీ కేమీ చిక్కులేదు. నీవొంటిమీద కోటిరూపాయల నగలున్నా మేము తాకము. చూడు — — — మా అందరిదగ్గరా ఒకొక్కసారి — — —" అన్నాడు ఆ నలుగురిలో ఒకడు.

"ఛీ, ఛీ, — — — మీకు అప్పచెల్లెళ్లులేరూ?"

"అప్పచెల్లెళ్లు వున్నారు. పెళ్లాలు వున్నారు. వాళ్లవూసెత్తకు; అక్కచెల్లెళ్ల వరసతో కాదుగా, నిన్ను మేమడిగేది. మరదలివరసతో"—

"హి హి హి" అని తక్కినముగ్గురూ యికిలించారు.

"మీకు దణ్ణంపెడతా, నే నలాంటిదాన్ని కాను. నన్నొదిలెయ్యండి మీకు పుణ్యముంటుంది." అని వేడుకుంది మాణిక్యం.

"పుణ్యంకోసము మేము యేడవటంలేదులే. మామాటవిను. మాపని అయిపోంగనే, మేము తోడువచ్చి నిన్ను మీవూళ్ళోవదలిపెడతాము. సై, అను. మేమంత యాబ్రాసిగావున్నామా చూడు."

"నేనలాంటిదాన్ని కాదు. నన్ను పోనియ్యండి. అలాంటిపనికి నేను వొప్పుకోను. నన్ను చీల్చినా సరే, నరికినాసరే, నన్ను ముట్టుకోనియ్యను."

“ఆలోచించుకో, కావలిస్తే నలుగురమూ నీకు కొద్దో గొప్పో ముట్ట చెపుతాము. మాకు ఊరికే కోపము తెప్పించకు. నీ సిగ పువ్వారాలకుండా, పేటలో దిగపెడతాం. ఏం. ఆలోచించుకో.”

ఆమె మాట్లాడలేదు.

“ఆలోచించుకో”

“అక్కరలేదు.”

“అయితే బలవంతాన చెరుస్తాము. ఆట్టే నీలిగావంటే—”

ఆమెకి భయమేసింది. అంతపనీ చేస్తారనీ, చెయ్యగలరనీ వాళ్ళ మొగాలే చెపుతున్నాయి. ఆలోచించుకుంది. చీకట్లో, వాళ్ల కళ్లూ పళ్లూ జిగజిగ మెరుస్తున్నాయి.

“అయితే...నన్ను కాలుమడికి పోనియ్యండి” అంది మాణిక్యం.

“ఇదేదైనా యెత్తుకాదుకద. ఎక్కడికిపోతావు పోయిరా.”

“నేను తలుపు వేసుకుంటాను.”

“బయటికి పోయా?”

“అవును”

“ఏం, తెలివిచూపించావు. మమ్మల్ని లోపలపెట్టి”

“——లేకపోతే యెట్లా, మీ నలుగురియెదటా ఒక్కసారి—”

“అహాహా. సరేకానీ, నీ పమిటకొంగు తలుపుసందులోనుంచి మాకియ్యి. బయట నీపని కానిచ్చుకునీ మళ్లా లోపలికిరా”

[ఇరవయ్యొకటి

మాణిక్యానికి మార్గాంతరమేమీ కనపడలేదు. కొడుకును కూడా బయటికి పంపించమంటే వాళ్లు వొప్పుకోలేదు. వాళ్లు కోరినట్టుగానే, కొంగు వాళ్ళకిచ్చి, తలుపుదగ్గిరగా లాగి గబుక్కున గొళ్లెం పెట్టింది.

పదినిముషాలు—అంతా నిశ్శబ్దముగావుంది.

“అయిందా” లోపల్నించి ప్రశ్న.

“తలుపుతియ్యి. లోపలికి వస్తావా? రావా?—

“ఏయ్”

చీర, వాళ్లు పట్టుకున్నంతమట్టుకి, చర్రున చింపేసింది. లోపల్నించి వాళ్లులాగగా, చిరిగినతుండెం వాళ్ళని చేరుకుంది.

“మాధర్చోద్. తలుపుతియ్యి నరుకుతాం—తలుపు పగలగొడతాం—తియ్యి ఏయ్.”

వాళ్లు తలుపుతన్నారు. ఊపారు. ఇనుపకమ్మీలతో గోడలోకి బిగించిన తలుపు. రాతిగోడ. టోలుగేటుకోసం కట్టిన యిల్లుకదూ!

“తీస్తావా, తియ్యవా” అని అడిగారు

‘నీబిడ్డణ్ణి నరుకుతున్నాం’ అని బెదిరించారు.

“అమ్మో, మీకు దణ్ణంపెడతా. మిమ్మల్ని యెవరికీ పట్టియివ్వను! తెల్లవారంగానే, ఒదిలేస్తా, నాబిడ్డణ్ని యేంచెయ్యకండి. మీకు దణ్ణం పెడతా. మీ చెల్లెల్నినేను.” అని ఆమె బయటినుంచి ప్రార్థించింది.

"ఛీ. నోరుముయ్."

"నా బిడ్డడ్నేం చెయ్యకండి."

అతిదీనంగా వేడింది వాళ్ళని మాణిక్యం. వాళ్లకి ఆత్మరక్షణ ప్రధానమైంది యిప్పుడు. ఎలాగయినా దాన్ని లొంగదియ్యాలి.

"అమ్మోయ్. ఓఅమ్మా. నా కాలుకోస్తున్నారో నాయనా, అమ్మో అమ్మా తలుపుదియ్యవే. అమ్మా అమ్మా—" కొడుకి గొంతు.

"బాబోయి, అమ్మా అమ్మా"

మాణిక్యానికి ఆలోచనపోలేదు. ఏంచేస్తుంది. ఇప్పుడు తలుపు తీసిందా వాళ్లు తనను చెఱపడం నిజము, తన్నడం నిజము. ఎంతేనా చేస్తారు లేకపోతే.—

"అమ్మోవ్. ఆఁ ఆఁ ఆఁ అమ్మా"

పిల్లాడితోటి ఏం చెపుతుంది. ఏమని ఊరడించడానికీ మాణిక్యానికి తోచలేదు.

"అమ్మా......"

అంతే యింక ఆకొడుకి మాటలు మాణిక్యం జన్మలో మళ్లీవినలేదు. తల్లి పేగును చంపుగొని, కళ్లనీరుకారుస్తూ అడివంతా దద్దరిల్లేటట్టు కేకలు వేస్తూ అలా ఆ అరుగుమీదపడి దొర్లుతూ చెప్పనలవికాని బాధపడి పోతోంది. లోపలనుంచి వాళ్లు యెంతేనా గోలచేస్తున్నారు. కాని తలుపు రాదు. మాణిక్యం తియ్యదు. రాత్రంతా యిలా వేగింది.

[ఇరవై మూడు

ప్రొద్దుపొడుస్తుండగానే అక్కడికి పదిమైళ్లలోవున్న రైలుస్టేషనుకి పేటనుంచిపోయే మోటారుబస్సు ఆరోడ్డుమీదే మామూలు ప్రకారం వచ్చింది. బస్సుకి యెదురుగాపోయి బస్సు ఆపించి బస్సులోవాళ్లకి ఈసమాచారం చెప్పింది మాణిక్యం. బస్సులోవున్న ఇరవై ఆర్గురు ప్రయాణీకులూఅక్కడదిగిపోయారు. తలుపుతియ్యటానికి యెవరికీ గుండెఆగిందికాదు. బస్సుతీసుకొని, ఆరుమైళ్లలోవున్న పోలీసుస్టేషనుకిపోయి, జవాన్లనీ యిన్‌స్పెక్టరునీ తుపాకుల్తోసహా తీసుకొచ్చాడు, డ్రైవరు. అతికష్టము మీద ఆ నలుగురికీ బేడీలువేశారు. వాళ్లు తుండేల క్రింద నరికిన ఆబిడ్డల్ని చూసి అందరూ కన్నీరు కార్చారు.

*                    *                    *

పోలీసుస్టేషను లాకప్‌గది కిటికీ వూచలు తొలిగించి పారిపోయి, యినస్పెక్టరు ఉద్యోగానికి ముప్పుదెచ్చినవాళ్లు, ఆ నలుగురూను. ఆ దొంగల్నిపట్టి యిచ్చినందుకు మాణిక్యముమీద ఆ యినస్పెక్టరుకి కలిగిన పూజ్యభావానికి పరిమితిలేదు.

మాణిక్యం చెప్పిన కథంతావిని, అర్థం చేసుకుని సుబ్బన్నను పిలిపించి కాపురం సరిగ్గా చేసుకోలేకపోతే అరెస్టు చేస్తానని బెదిరించి సూరయ్యని పిలిపించి నీకూతుర్ని కట్టుబాటులో వుంచకపోతే డొక్క చీలుస్తానని కోపపడి, ఆ దంపతులిద్దరినీ కలిపాడు యినస్పెక్టరు.

మళ్లా పదినెలలకి మాణిక్యం మగపిల్లవాణి కన్నది. మొదటి కొడుకును బలియిస్తేనేకాని రెండోకొడుకు పుట్టాడుకాదు పాపం.